

ఓ 60 ఏళ్ల క్రితం సంగతి. న్యూయార్క్‌లో జెనోవీస్ అనే అమ్మాయి ఉండేది. భర్త నుంచి విడిపోయిన తర్వాత ఓ బార్‌లో పనిచేస్తూ పొట్ట నింపుకొంటున్నది. ఈ నేపథ్యంలో ఓ మధ్యాహ్నం వేళ జెనోవీస్ తన ఇంటికి చేరుకునేసరికి... ఓ ఆగంతకుడు ఆమెను వెంబడిస్తూ వచ్చాడు. తనను కత్తితో పొడిచి, అత్యాచారం చేసి, చనిపోయేదాకా పొడిచి వెళ్లాడు. జెనోవీస్‌ను మొదటిసారి పొడిచినప్పుడే తను గట్టిగా అరిచింది. కానీ, ఎవరూ ఆమె ఆర్తనాదాలను పట్టించుకోలేదు. దాదాపు అరగంటపాటు ఈ నేరం కొనసాగింది. చుట్టుపక్కల చాలామంది ఈ అరుపులను విన్నారనీ, కొంతమంది నేరాన్ని చూశారని మర్నాడు న్యూయార్క్ టైమ్స్‌లో కథనం వచ్చింది. అయితే ఈ కథనం మరీ అతిశయోక్తులతో నిండిందనీ, మరీ అంతమంది సాక్షులు లేరనీ, కొంతమంది పోలీసులకు ఫోన్ చేసే ప్రయత్నం చేశారనీ తెలిసినా... 'జెనోవీస్ హత్య' నేరాల పట్ల సామాజిక స్తబ్ధతకు ఓ నిదర్శనంగా నిలిచిపోయింది.

## ప్రేక్షకపాత్ర సిద్ధాంతం

జెనోవీస్ హత్యోదంతం చాలా సంచలనంగా మారింది. దాని ఆధారంగా ఎన్నో వ్యాసాలు, పుస్తకాలు వెలువడ్డాయి. సహజంగానే వీటిలో మానవత్వం గురించి ప్రశ్నలు లేవనెత్తారు. ఈ చర్చ అంతా కూడా శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. జాన్ డార్లే, బిబ్ లెటెన్ అనే సామాజిక శాస్త్రవేత్తలు ఈ విషయమై కొన్ని పరిశోధనలకు పూనుకున్నారు. వాటిలో ఓ ప్రయోగంలో



జాన్ డార్లే బిబ్ లెటెన్

అభ్యర్థులను మూడు పరిస్థితుల్లో కూర్చోబెట్టారు. మొదటి సందర్భంలో గదిలో వాళ్లు ఒంటరిగా ఉన్నారు. రెండో పరిస్థితిలో మరో ఇద్దరితో కలిసి కూర్చోబెట్టారు. మూడో నేపథ్యంలో తాము చెప్పినట్టు చేసే ఓ ఇద్దరు వ్యక్తులతో కలిపి కూర్చోబెట్టారు. ఇక ఆ తర్వాత ప్రయోగం మొదలైంది. ఆ గదిలోకి సన్నగా పొగను వదిలారు. ఒంటరిగా ఉన్న అభ్యర్థుల్లో ఏకంగా 75 శాతం మంది ఆ పొగ గురించి రిపోర్ట్ చేశారు. మరో ఇద్దరితో కూర్చున్నవారిలో దాదాపు మూడో వంతు మాత్రమే పొగ గురించి హెచ్చరించేందుకు సిద్ధపడ్డారు. ఇక మూడో పరిస్థితిలో శాస్త్రవేత్తలు సూచించినట్టుగా మిగతా ఇద్దరూ నిశ్శబ్దంగా ఉండిపోయినప్పుడు... పొగ గురించి చెప్పేవారి సంఖ్య ఏకంగా పదో వంతుకు తగ్గిపోయింది. ఈ తరహా సామాజిక స్తబ్ధతకు 'బైస్టాండర్ ఎఫెక్ట్' అని పేరు పెట్టారు ఆ ఇద్దరు శాస్త్రవేత్తలు. ఆ తర్వాత కూడా ఎన్నో పరిశోధనలు పదేపదే ప్రమాదంలో 'ప్రేక్షకపాత్ర ప్రభావాన్ని' రుజువుచేశాయి. కేవలం అనూహ్యమైన పరిస్థితుల్లో మాత్రమే కాదు... సాటి మనిషి ప్రమాదంలో ఉన్నప్పుడు కూడా చుట్టూ ఉండే గుంపులో స్తబ్ధత ఉన్నట్టు గ్రహించారు.

## ఎందుకిలా?

బైస్టాండర్ ఎఫెక్ట్‌ను కనుగొని యాభై ఏళ్లకు పైనే అయ్యింది. కాబట్టి ఇప్పటికిప్పుడు అకస్మాత్తుగా మానవత్వం కనుమరుగైపోయింది అనుకోవడానికి లేదు. అయితే ఈ ప్రభావానికి కారణాలేంటో తెలుసుకోవడం కాస్త ఆసక్తిగానే ఉంటుంది.

**నేనే ఎందుకు?**

ఇంతమంది చూస్తుండగా జరుగుతున్నది కదా! నేనే ఎందుకు బాధ్యత తీసుకోవాలి అనే ఆలోచనే ఈ ప్రేక్షక ప్రభావానికి అతి ముఖ్య కారణం అంటారు. దీనికి 'Diffusion of responsibility' అని పేరు. గుంపు పెరిగే కొద్దీ ఈ ఆలోచన మరింత బలంగా అడ్డుపడుతుందట. అంతేకాదు! అక్కడ ఎవరన్నా నిపుణులు (ఉదా।। అగ్నిమాపక సిబ్బంది, వైద్యులు, పోలీసులు...) ఉంటే ఆ భరోసాతో మరింత స్తబ్ధుగా ఉంటారని తేలింది. ఈ Diffusion of responsibility కేవలం ప్రమాదాలకు మాత్రమే పరిమితం కాదు. ఇతరుల పట్ల అణచివేత జరుగుతున్నప్పుడు, తప్పు చేయమని అధికారులు సూచించినప్పుడు... అది తమ నిర్ణయం కాదు, తప్పు కాదు కాబట్టి ఫర్వాలేదులే అనే భావనే స్తబ్ధతకు దారితీస్తుంది. ఇదే యుద్ధ నేరాలకు, వివక్షకు దారితీస్తుంది. ఆఫీసుల్లోనో, స్కూళ్లలోనో ఎవరో ఒకరిని లక్ష్యంగా చేసుకుని ఏడిపించినప్పుడు... మిగతా వారి మౌనానికి కారణం కూడా ఇదే!

## కాపాడలేమా

**సీపీఆర్** (కార్డియోపల్మనరీ రిససిటేషన్) కృత్రిమ శ్వాసను అందించే ఓ పద్ధతి. గట్టిగా కూర్చుంటే ఓ గంటలో దీని మీద పట్టు సాధించవచ్చు. కానీ మనదేశంలో కేవలం రెండు శాతం మందికే దీని గురించి అవగాహన ఉన్నట్టు ఓ నివేదిక చెబుతున్నది. బహుశా అందులోనూ వైద్య సిబ్బందో లేక స్వచ్ఛంద కార్యకర్తలో ఉండి ఉంటారు. కళ్ల ముందు ఎవరికన్నా స్పృహ తప్పడం, విద్యుదాఘాతం, నీళ్లలో మునగడం... లాంటి పరిస్థితుల్లో ఊపిరి ఆగిపోతే ఈ చిన్నపాటి నైపుణ్యంతో వారి ప్రాణాలు కాపాడవచ్చు. అంతేకాదు. యాభై శాతం గుండెపోట్లు రోజువారీ దినచర్యలో అకస్మాత్తుగా వస్తాయని ఓ గణాంకం చెబుతున్నది. మనవారైనా, తెలియనివారైనా... కళ్ల ముందే గుండె పట్టుకుని కూలిపోయే సందర్భంలో సీపీఆర్ తెలిసి ఉంటే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది. కేవలం సీపీఆర్ మాత్రమే కాదు... ఈ తరహా ప్రథమ చికిత్సల పట్ల ఎలాంటి అవగాహన లేకపోవడంతో ఏటా లక్షన్నర మంది మన కళ్ల ముందే చనిపోతున్నారని 'ద గార్డియన్' పత్రిక పేర్కొంది. 'ఏ చికిత్స చేయాలో నాకు తెలియదు కదా!' అనే అవగాహన లోపం బైస్టాండర్ ఎఫెక్ట్‌కి ఒకానొక కారణంగా మారుతున్నది.

